


వాకర్స్‌కు సన్మానం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో తిరుపతి గోవింద రాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో వాకర్స్ అసోసియేషన్, తారకరామా స్టేడియం వాకర్స్ అసోసియేషన్‌లోని 80 సంవత్సరాల పైబడిన వాకర్స్ సభ్యులకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 80 వయస్సులో కూడా ఉత్సాహంగా వాకింగ్ చేస్తూ వాకింగ్ చేసే వారికి స్ఫూర్తినిస్తూ ఆరోగ్యం పెంపొందేందుకు దోహదపడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెడ్డివారి ప్రభాకర్ రెడ్డి, మాజీ డీస్పీ శంకర్, కార్పొరేటర్ ఎస్‌కె.బాబు, మాయాబజార్ భాస్కర్‌రెడ్డి, కత్తుల సుధాకర్, దేవరాజులు నాయుడు, శేషాద్రి, విజయభాస్కర్ రెడ్డి, షాబుద్దీన్ పాల్గొన్నారు.



స్త్రీనిధి రుణాలు పక్కదారి

- చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న మెప్మా
- ఆడిటింగ్ అంతంత మాత్రమే..

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

నిధులు పక్కదారి పడుతున్నా మెప్మా అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తారు. ఫిర్యాదు చేసిన పట్టించుకోరు. స్త్రీనిధి నిధులు పక్కదారి పడుతున్నప్పటికీ మనకెందుకులే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. మహిళ సంఘాలకు స్త్రీనిధి కింద చెల్లించే నిధులు పక్కదారి పట్టాయి. జిల్లా వ్యాప్తంగా అనేక మండలాల్లో సంఘం సభ్యులకు ఇవ్వాల్సిన నగదును సీసీలు, ఏపీఎంలు తమ సొంత అవసరాలకు వాడుకున్నారు. సభ్యులకు తెలియకుండానే వారి పేరుతో రుణాలు మంజూరు చేయించి కొట్టేస్తున్నారు. బ్యాంకుల నుంచి రుణాలు చెల్లించాలని ఒత్తిడి వస్తున్న సమయంలో అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. అప్పటికే నిధులు పెద్దఎత్తున పక్కదారి పడుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా పూర్తిస్థాయిలో ఆడిటింగ్ చేయిస్తే అక్రమాలు వెలుగులోకి వచ్చే ఆస్కారం ఉంది. జిల్లాలో 34,181 స్వయం సహాయక సంఘాలున్నాయి. ఏడాదికి ఒక్క స్త్రీనిధి పథకం ద్వారానే రూ.160కోట్ల మేరకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరవుతున్నాయి. ఈ నిధులను ఆర్పీలతోపాటు సీసీలు, ఏపీఎంలు తమ స్వప్రయోజనాలకు వినియోగించుకుంటున్నారు. ఇప్పటికే తిరుపతి నగరంలోని చింతలచేను ప్రాంతంలో ఒక సంఘంలోని సభ్యులు రుణాలు తీసుకున్నారు. తిరిగి బ్యాంకులకు రుణం సొమ్ము చెల్లించే క్రమంలో ఆర్పీకి నగదును అందజేయగా కొంత మాత్రమే చెల్లించి మిగిలింది తన సొంత అవసరాలకు వాడుకున్నారు. మరోమారు రుణాల కోసం సంఘం సభ్యులు బ్యాంకులకు వెళ్లగా విషయం వెలుగులోకి వచ్చింది. తిరుపతి చింతలచేను 25 సంఘాల్లో ఉన్న ఓ సమాఖ్య రిసోర్స్ పర్సన్ రూ.19 లక్షల పైగా తమ సొంత అవసరాలకు వాడుకున్న విషయం బయటపడింది. అలాగే డక్కిలి మండలంలో సీసీలు, ఏపీఎంలు, సమాఖ్య సంఘం సభ్యులు వచ్చిన నిధుల్లో రూ.1.32 కోట్లు, సొంతానికి వాడుకున్న విషయం విలువలకు రావడం జరిగింది. అయినా చర్యలు నామపుమాత్రమే.

అక్రమాలు.. సొంత ప్రయోజనాల కోసమే..

ఒక సంఘానికి మంజూరైన రుణాలను వారికి ఇవ్వకుండా వేరే గ్రామ సంఘానికి బదిలీ చేశారు. తర్వాత నగదును నేరుగా వ్యక్తుల పేర్లపై డ్రా చేసి తమ సిబ్బంది వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకున్నారు. గ్రామసంఘాల్లోని స్త్రీనిధి, ఉన్నతి రుణాల రికవరీ మొత్తాలను చెల్లించిన సంఘాలకు కాకుండా రికవరీ చెల్లించని వాటికి తప్పుగా అడ్జస్ట్మెంట్ చేశారు. డక్కిలి మండలంలో సునీల అనే సీసీ ఏకంగా రూ.17,63,401ల నిధులను తన సొంత ప్రయోజనాల కోసం వాడుకున్నట్లు నిరూపితమైంది. ఆమెతో పాటు మొత్తం పది మంది. ఇలా నిధులు పక్కదారి పట్టించారని వెల్లడైంది. మొత్తం రూ.1.32 కోట్లు పక్కదారిపట్టగా రికవరీ చేసింది రూ.26.35 లక్షలు మాత్రమే. ఇంకా రూ.1.05 కోట్లు రాబట్టాల్సి ఉంది.

సభ్యులు ఆందోళన...

ఒక్కొక్కటిగా మహిళ సంఘం సభ్యుల నిధులు పక్కదారి పడుతున్న ఘటనలు వారిలో ఆందోళన కలిగిస్తోంది. తమ పేరుతో బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు చెల్లించకపోతే భవిష్యత్తులో సమస్యలు ఎదురే అవకాశం ఉందని తమకు కొత్త రుణాలు మంజూరు కావని ఆందోళనకు గురి అవుతున్నారు. దీనిపై మెప్మా ఉన్నతాధికారులు ఈ విషయం తెలిసిన కూడా వారు సకాలంలో స్పందించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా వారిపై చర్యలు తీసుకోకపోతే మహిళలు ఆందోళనకు పూనుకునే అవకాశం ఉంది.



కఠిన చర్యలు తీసుకోవాలి: ఐద్వా

జిల్లాలో స్త్రీనిధి నిధులు పక్కదారి పట్టించిన సిబ్బందిపై మెప్మా ఉన్నతాధికారులు కఠినచర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జయంతి, శ్రీసాయి లక్ష్మి ప్రకటనలో డిమాండ్ చేశారు. స్త్రీనిధి నిధులు పక్కదారి పడుతున్నాయని, గతంలో ఐద్వా ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని వారు తూతూ మంత్రంగా చర్యలు చేపట్టారే తప్ప సంఘంలో ఉన్న సభ్యులకు భరోసా కల్పించేలా చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా మెప్మా అధికారులు నిద్రమత్తులో నుంచి మేల్కొనాలన్నారు.

అధికారం మాది.. ఆపేదెవరు..!

- ట్రాక్టరు ఇసుక రూ.5 వేలు
- పేరుకే ఉచితం
- రీచ్ లేకపోవడంతో బ్లాక్‌లోనేకొనుగోళ్లు
- సామాన్యుడికి భారంగా ఇసుక

ప్రజాశక్తి -విజయపురం: 'ఇసుక ఉచితం....ఇసుక ఉచితం..' అంటూ ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ మాట మరిచిపోయింది. ప్రభుత్వం మారిందే తప్ప.. ఇసుక ధర మాత్రం మారలేదు. అదే ధర, ఇంకా చెప్పాలంటే గత ప్రభుత్వంలో కన్నా కొన్ని చోట్ల ఎక్కువగానే అమ్ముకొంటున్నారు. పేరుకే ఉచిత ఇసుక రవాణా ఛార్జీలు, టీఎసీటీ, సీవరేజీల రూపంలో బాదుడేబాదుడు అన్నట్లుగానే మారింది. దీంతో ఉచితం ప్రచారానికే పరిమితమైంది. ఇసుకపై తర్జనభర్జనలు పడుతున్నారే తప్ప ఆ సమస్యను ఓ కొలిక్కి తెచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో సామాన్యులకు ఇసుక పెనుభారంగా మారింది. ఇసుకతో ఇక ఇల్లు కట్టుకోలేకపోతున్నారు.

బ్లాక్ మార్కెట్‌లో ఇసుక రూ. 5వేలు

నగరి నియోజకవర్గంలో ఇసుక రీచ్ ఎక్కడా లేదు. దీంతో ఇళ్ల నిర్మాణం కోసం బ్లాక్‌లో ఇసుకను కొనుగోలు చేస్తున్నారు. ఒక ట్రాక్టర్ ఇసుక ఇప్పుడు రూ.5 వేల నుంచి రూ.6 వేలు ధర పలుకుతోంది. నియోజకవర్గంలో ఎక్కడైనా ఇదే ధర అమలులో వుంది. ఇలా ఇసుక అందుబాటులో లేకపోగా ధరలు భగ్గుమంటున్నాయి.

ఇసుక అక్రమ రవాణా

నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాకు దారి తీస్తోంది. విజయపురం మండలం కేవీ శ్రీరామపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన సొంత పొలం దారి ఏర్పాటు చేసుకొని రాత్రి పగలు తేడా లేకుండా ఇసుకను తరలిస్తున్నాడు. ఒక ట్రాక్టర్ ఇసుక రూ.5వేలు నుంచి రూ.6 వేలు వరకు అమ్ముతున్నట్లు సమాచారం. ఈ విషయం రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టించుకోలేదని, వారం వారం అధికారులకు మామూళ్లు ఇవ్వడంతో పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా తాను తన సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం వల్ల ఆయనను పట్టుకోకూడదని ఓ వర్గానికి చెందిన నాయకుడు అధికారులకు సూచించినట్లు సమాచారం. ఇసుక కొరత ఆ రైతుకు ఓ వరంగా మారింది. దీంతో రోజుకి రూ. 20 వేలుపైగా సంపాదిస్తున్నాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఉచిత ఇసుకను అందుబాటులోకి తేవాలని, లేకుంటే ఇసుక అక్రమ రవాణా అధికమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



అక్రమంగా తరలిపోతున్న ఇసుక



యథేచ్ఛగా రవాణా చేస్తుండడంతో తరిగిపోతున్న ఇసుక నిల్వలు

క్రీడా హబ్‌గా శ్రీకాళహస్తి: ఎమ్మెల్యే బొజ్జల



ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దనున్నామని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. స్థానిక శ్రీకాళహస్తి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇంటర్ డిస్టిక్ జూడో ఛాంపియన్షిప్ క్రీడాపోటీలను సోమవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి శాప్ ఛైర్మన్ రవికుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నిధులు సాధించి ఈ ప్రాంతాన్ని క్రీడా కేంద్రంగా తీర్చి దిద్దుతామన్నారు. విద్యార్థులు కూడా విద్యతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని తెలిపారు. అలాగే ఇండోర్ స్టేడియంను అధునాతంగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం జిల్లాకు చెందిన పేద జూడో క్రీడాకారిణి ఝాన్సీ, ఆమె కోచ్ గోపిలకు పది వేల రూపాయలు వంతున ఆర్థిక సహాయం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, టీడీపీ నేత బొల్లినేని జగన్నాధం నాయుడు పాల్గొన్నారు.

తిరుపతిలో ఏప్రిలియా ఆర్ఎస్ 457

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : పియాజియో ఇండియా ప్రతిష్టాత్మక ద్విచక్రవాహన బ్రాండ్‌లు వెస్పా, ఏప్రిలియాలకు అధీకృత రిటైలర్ అయిన నికి మోటార్స్ తిరుపతిలోని రేణిగుంట రోడ్డులో ఉన్న తమ ప్రీమియం షోరూమ్‌లో కందాల పునీత్ కృష్ణకు 25వ ఏప్రిలియా ఆర్ఎస్ 457ను డెలివరీ చేసింది. ఈ వాహనాన్ని ఆయనకు తిరుపతి డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ నాయుడు, నికి మోటార్స్ సీఈవో నాగభూషణ్ రెడ్డితో కలిసి అందజేశారు. ఏప్రిలియా ఆర్ఎస్ 457 డెలివరీని తీసుకున్న కందాల పునీత్‌కృష్ణ మాట్లాడుతూ 'ఏప్రిలియా ఆర్ఎస్ 457ని ఇంటికి తీసుకెళ్లడానికి నేను చాలా సంతోషిస్తున్నాను. బైక్ పనితీరు అసాధారణమైనది. నా స్పోర్ట్స్ బైక్ రైడింగ్ ప్రయాణాన్ని ఏప్రిలియాతో ప్రారంభించాలని నేను కోరుకున్నాను. నికి మోటార్స్ వారు అందించిన సహాయానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నాను..' అని అన్నారు. ఏప్రిలియా ఆర్ఎస్ 457 మూడు విభిన్న రంగులు - రేసింగ్ స్ట్రిప్స్, ఒపలెసెంట్ లైట్, ప్రిస్మాటిక్ డార్క్‌తో వస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్స్-షోరూమ్ ధర 4.11లక్షల ఉందని వారు తెలిపారు. కొత్త వాహనాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



31 వరకు టొయోటా గ్లాంజా ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

పండుగ స్ఫూర్తిని మరింత పెంచుతూ, టొయోటా కిర్లోస్కర్ మోటార్ 'ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్'ని పరిచయం చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా టొయోటా కిర్లోస్కర్ మోటార్ సేల్స్- సర్వీస్- యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ శబరి మనోహర్ మాట్లాడుతూ ఈ పండుగ సీజన్‌లో మా కస్టమర్‌లకు మరింత ఉత్సాహాన్ని అందించడమే మా లక్ష్యం అన్నారు. టొయోటా గ్లాంజా 'ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్' పరిచయంతో గ్లాన్జా దాని డైనమిక్- స్పోర్టీ డిజైన్, అధునాతన ఫీచర్లు, అత్యుత్తమ పనితీరు కోసం ఎల్లప్పుడూ ప్రశంసించబడిందని అన్నారు. పండుగ ఆఫర్‌లో భాగంగా, టొయోటా గ్లాంజా ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్‌ని ఎంచుకునే కస్టమర్‌లకు కాంప్లిమెంటరీ టిజిఎ ప్యాకేజీలు 31 అక్టోబర్ వరకు అందుబాటులో ఉంటాయి. అన్ని టొయోటా డీలర్‌షిప్‌లలో బుకింగ్‌లు తెరిచి ఉన్నాయి. వినియోగదారులు కారును ఆన్‌లైన్‌లో ద్వారా బుక్ చేసుకోవచ్చని తెలిపారు.



పల్లె పండుగతో 'పల్లె ప్రగతి'

డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం) :

నరేగా నిధులతో ఉపాధి పెంపొందించడమే కాక పచ్చదనాన్ని కూడా పెంపోందించడానికి నూతన ప్రణాళికలు రూపోందించామని డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. తిరుపతి జిల్లా పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన నూతన ప్రణాళికలు, కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పల్లెపండుగ ద్వారా గ్రామాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజాశక్తితో డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ మాట్లాడారు.

ప్రజాశక్తి: పల్లె పండుగ ద్వారా గ్రామాల్లో ఎటువంటి అభివృద్ధి జరగనుంది?

డ్వామా పీడీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పల్లె పండుగ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆయా గ్రామాల ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు వీలుగా పనులను ఎంపిక చేసి కేటాయింపులు చేస్తున్నాం. జిల్లా పరిధిలోని ఆయా నియోజికవర్గాల్లోని మండలాలకు రూ.2 కోట్ల చోప్పున నిధులు వివిద రకాల పనులకు కేటాయిస్తున్నాం. మౌలిక వసతులతో పాటుగా గ్రామాల్లోని వారికి వ్యక్తిగత లబ్ధి చేకూరేలా పశువులకు షెడ్లు నిర్మాణానికి నరేగా నిధులతో శ్రీకారం చుట్టాం. ఇప్పటికే జిల్లా పరిధిలో 650 పశువుల షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసాం.

ప్రజాశక్తి: పల్లె పండుగలో దళితవాడల అభివృద్ధికి తీసుకున్న నిర్ణయాలు ఏవి?

డ్వామా పీడీ: పల్లె పండుగ ద్వారా తిరుపతి జిల్లా పరిధిలోని మండలాల్లో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసి అక్కడి ప్రజలకు ఉపయుక్తమైన పనులపై ఇప్పటికే జిల్లా కలెక్టర్ వేంకటేశ్వర్ పలు సూచనలు చేశారు. జిల్లా పరిధిలోని దళిత వాడలకు రూ.50 కోట్లతో సిసి రోడ్లు, రూ.30 కోట్లతో సిసి డ్రైన్లు నిర్మాణానికి నిధులు మంజూరు జరిగింది.

ప్రజాశక్తి: పచ్చదనం పెంపోందించడానికి నరేగా నిధులు కేటాయించారా?

డ్వామా పీడీ: తిరుపతి జిల్లా పరిధిలో పచ్చదనం పెంపొందించడానికి జిల్లా అటవీశాఖ అధికారి ఇప్పటికే తమ సహకారిన్ని కోరారు. జిల్లాలోని 9 రేంజ్‌లలో నర్సరీల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఈ నర్సరీల ద్వారా మొక్కలను పెంచి విరివిగా పచ్చదనం పెంపోందించడానికి చర్యలు తీసుకుంటుంన్నాం.

ప్రజాశక్తి: ఉపాధి హామీ పనులతో ఎలాంటి ప్రగతి జిల్లాలో జరిగింది..?

డ్వామా పీడీ: తిరుపతి జిల్లా పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్, మే, జూన్ మాసాలలో చెరువులకు వెళ్లే నీటి కాలువలను శుభ్రం చేయించాం. దీని ద్వారా ఇటీవల కురిసిన వర్షాలకు నీరు వేగంగా చెరువుకు చేరింది. నీరు నిలబడిపోయి ఎక్కడగానీ ఇబ్బందులు రాలేదు. ఇవే కాకుండా వర్షపు నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు సంవృద్ధిగా పెరగడానికి పలు పనులను చేశాం. ఈవార్షిక బడ్జెట్ కేటాయింపుల్లో ఉపాధి హామీ పనులకు రూ.204 కోట్లను ఖర్చు చేశాం. ఈ ఆర్థిక సంవత్సరంలో తిరుపతి జిల్లా పరిధిలో ఉపాధి హామీ పనులపై ప్రతి పంచాయతీలో సిటిజన్ చార్టర్ ద్వారా నిధులు కేటాయింపులు, జరిగిన వివిధ రకాల పనుల వివరాల పట్టికలను ప్రదర్శిస్తున్నాం.



డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్

షేక్ హసీనాబానుకు కలాం విశిష్ట సేవాపురస్కారం



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రేణిగుంటకు చెందిన సినిమా ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సభ్యురాలు షేక్ హసీనా బాను ఏపీజే అబ్దుల్ కలాం విశిష్ట సేవాపురస్కారం అందుకున్నారు. తిరుపతి కలాం ట్రస్ట్ 7వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కలాం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు బాష అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమాన్ని తిరుపతి మహతి కళాక్షేత్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సేవారంగాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న పలువురిని అతిథుల చేతుల మీదుగా పురస్కారాలతో సత్కరించారు. అలాగే ఎందరో పేదవిద్యార్థులకు, వృద్ధులకు, నిరాశ్రయులకు, తన వంతు సహాయ, సహకారాలు అందించిన సేవా మూర్తి, రేణిగుంట పట్టణానికి చెందిన తెలుగు సినిమా ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సభ్యురాలు షేక్ హసీనా బాను కూడా కలాం విశిష్ట సేవా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా షేక్ హసీనా బాను మాట్లాడుతూ కలాం ట్రస్టు తనను ఈ పురస్కారం కోసం ఎంపిక చేసి అవార్డు ప్రధానం చేయడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. కలాం ట్రస్ట్ నిర్వాహకులు బాషకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఏ జబ్బర్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ షేక్ ఫరీద్ బాబా తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారంపై ఖండన

ప్రజాశక్తి- కుప్పం టౌన్ : ద్రావిడ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమం విషయంలో కొందరు ప్రోటోకాల్ పాటించడం లేదంటూ చేస్తున్న ప్రచారాన్ని కులసచివులు ఆచార్య కిరణ్ కుమార్ ఖండించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఆదివారం విశ్వవిద్యాలయ ప్రారంభోత్సవంతో పాటు బాషా, హరప్పా భవనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులను, ప్రముఖులను ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికలను ముద్రించామని, ఈ పత్రికలలో కార్యక్రమానికి విచ్చేసే ప్రముఖుల పేర్లు ప్రోటోకాల్ అనుసరిస్తూ ముద్రించడం ఆనవాయితీ అన్నారు. శిలాఫలకం పై ముద్రించే పేర్లను మాత్రమే ప్రజా ప్రతినిధుల హోదాలను అనుసరించి ప్రోటోకాల్ పాటిస్తున్నారన్నారు. దీన్ని అనుసరుస్తూ ప్రస్తుతం ఏర్పాటు చేసిన శిలాఫలకంపై మొట్టమొదట ముఖ్యమంత్రి చంద్రబాబు పేరు ముద్రించామన్నారు. ఈ విషయాన్ని గుర్తించక కొంత మంది ఆహ్వాన పత్రికలలో ముఖ్యమంత్రి పేరు ముద్రించలేదని ప్రచారం చేయడం సరికాదన్నారు.

నిర్లక్ష్యం

- ఏళ్లు తరబడి చేతిబోర్లు నిరుపయోగం
- పట్టించుకోని అధికారులు
- గ్రామీణ వాసులకు తప్పని నీటికష్టాలు

గ్రామీణ ప్రజల దాహార్తిని తీర్చే చేతి బోర్లు నేడు ఎక్కడ చూసినా నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. వందల సంవత్స రాలు గా చేతి బోర్లు మీదనే ఆధారపడి జీవించే గ్రామీణులు నేడు విద్యుత్ బోర్లపై ఆధారపడి తాగునీటి కష్టాలకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. బోర్ల మరమ్మతును అధికారులు పట్టించుకోక పోవడంతో తుప్పు పట్టి చోరీలకు గురవుతున్నాయి. దీంతో లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది.

ప్రజాశక్తి-పూతలపట్టు: గతంలో గ్రామీణ ప్రజలు అధికంగా తాగునీటి కష్టాలను అధిగమించడానికి చేతిబోరులను నమ్ముకునేవారు. దీంతో ప్రతి ఏటా వేసవి వస్తున్న తరుణంలో మంచినీటి ఎద్దడిని అరికట్టేందుకు వార్డుల్లో గ్రామీణ ప్రాంతాల్లో అవసరమైన చోట మంచినీటి బోర్లను తవ్విస్తూ ఉండేవారు. వేసవి ప్రత్యేక ప్రణాళిక అంటూ ప్రతి గ్రామంలో అవసరమైన చోట రెండు నుంచి మూడు వరకు చేతి బోర్లు వేసేవారు. దీంతో ప్రజలు కూడా విద్యుత్ అవసరం లేక చేతి బోర్లు వినియోగం ద్వారా తమ తాగినీటి సమస్యలను పరిష్కరించుకునేవారు. క్రమంగా ఇంటింటికీ కుళాయిలు రావడంతో గ్రామీణ ప్రజల సైతం చేతిబోర్లను పట్టించుకోవడం మానేశారు. దీంతో ఎక్కడ చూసినా చేతి బోర్లు అక్కడ మరమ్మతులకు నోచుకోక దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి.

పూతలపట్టులో పరిస్థితి

పూతలపట్టు మండలంలో 25 పంచాయతీలు ఉండగా ఇందులో 252 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల పరిధిలో సుమారు 962 చేతి బోర్లు ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం 80 శాతం చేతి బోర్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. కొన్ని బోర్లు పూర్తిగా తుప్పు పట్టిన పరిస్థితిలో ఉండగా సంబంధిత గ్రామీణ ప్రజలు వాటిని ఇతర అవసరాలకు వాడుకుంటున్నారు.

పట్టించుకునే వారే కరువు..

ఎలాంటి సమయాల్లోనైనా గ్రామీణ ప్రజల దాహార్తిని తీర్చే చేతి బోర్లను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. చేతి బోర్ల మరమ్మతులు చేసే వారే నేడు కనిపించడం లేదు. కనీసం ఎంపీడీవో కార్యాలయ పరిధిలో కూడా వీరు కరువయ్యారు. గతంలో చేతి బోర్ల మరమ్మతుల కోసమే ప్రత్యేక అధికారి ఉండేవారు. ప్రస్తుతం ఈ అధికారి ఊసే లేదు. దీంతో సంవత్సరాలు తరబడి చేతి బోర్లు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.



మరమ్మతుకు నోచుకుని బోరు

రూ. లక్షల్లో ప్రజాధనం వృథా

బోర్ల నిర్మాణం కోసం ప్రభుత్వం కేటాయిస్తున్న లక్షల రూపాయల నిధులు నేడు వృథాగా మారాయి. ఒక్కో బోరు వేయడానికి రూ. లక్ష రూపాయల నుంచి ఒకటిన్నర లక్ష వరకు ఖర్చువుతుంది. అధిక లోతు తవ్వడంతో మరింత ఖర్చయ్యే అవకాశం వుంది. బోరు తవ్వాం..మనపని అయిపోయిందన్నట్టుగా అధికారులు వ్యవహ రిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రతి గ్రామంలో ఎక్కడెక్కడ మంచినీటి బోర్లు పాడైపోయాయో గుర్తించి వాటిని వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు చేపడితే ప్రజాధనాన్ని కాపాడిన వారవుతారని ప్రజలు అంటున్నారు.

సరుకులు పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న సంఘం సభ్యులు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫలసరుకుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో డాక్టర్ సిఆర్ రెడ్డి ఆసరా పథకం ద్వారా డాక్టర్ జనార్ధన్ రెడ్డి, డాక్టర్ రోహిణీల దాతృత్వంతో పేదలకు నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకిరెడ్డి మధుసుదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పేట వెంకటకృష్ణారెడ్డి, కొత్తపల్లి సనత్ కుమార్ రెడ్డి, బండి ధనంజయ రెడ్డి, దశరథ రామిరెడ్డి, జనార్ధన్ రెడ్డి, మూలి హరినాథ్ రెడ్డి, కృష్ణారెడ్డి, హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జెవివి సేవలు అభినందనీయం



ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లను జెవివి అధ్వర్యంలో పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా బాలకృష్ణ రాజు విచ్చేసి ఆయన చేతుల మీదుగా చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణం రాజు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక సేవలు నన్ను ఎంతగానో ప్రభావితం చేస్తున్నాయని జెవివి ద్వారా దివ్యాంగులకు కూరగాయల గుడ్లు పంపిణీ చేయడం చాలా సంతోషాన్ని ఇస్తుందని వారికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తాను ముందుంటానని పేర్కొన్నారు. జెవివి వారు పది సంవత్సరాలుగా ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు భోజనాలు, ఒక సంవత్సరం పైగా దివ్యాంగులకు కూరగాయలు, గుడ్లు పంపిణీ చేయడం చాలా గొప్ప విషయమన్నారు. అంతే కాకుండా జెవివి ఆధ్వర్యంలో సమాజానికి ఉపయోగపడే అనేక కార్యక్రమాలను చేస్తున్నారని తెలిపారు. జెవివి వారితో కలిసి నేను కూడా పని చేస్తానని జెవివి సభ్యులందరినీ మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, రాధయ్య, ప్రభాకర్, మురళి సింగ్, జగదీష్, సురేష్, సాయికిరణ్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అచ్చెంను కలిసిన రంగినేని



మంత్రిని కలిసిన రంగినేని

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర మంత్రి అచ్చెం నాయుడును మంగళగిరి పార్టీ కార్యాలయంలో శ్రీకాళహస్తి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును కూడా మర్యాదపూర్వకంగా కలిసి ముక్కంటి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు. చెంచయ్య నాయుడుతో పాటు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి కూడా ఉన్నారు.


ఘనంగా ఆయుధ పూజ



ఆయుధ పూజ చేస్తున్న గ్రామ యువత

ప్రజాశక్తి - రామచంద్రాపురం(చంద్రగిరి): మండలంలోని పనపాకం పంచాయతీ అరిగిలవారిపల్లెలో గ్రామ యువత ఘనంగా ఆయుధపూజ నిర్వహించారు. విజయ దశమిలో భాగంగా ఆదివారం గ్రామ దేవత సత్యమ్మ గుడి ఎదుట కాళికామాత చిత్రపటం ఉంచి ఆయుధ పూజను నిర్వహించారు. గ్రామంలోని ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్ర వాహనాలు అన్నింటిని ఒకచోట చేర్చి గ్రామం మొత్తం తరలివచ్చి ఆయుధ పూజ నిర్వహించారు. ఇలా గ్రామంలో గత 25 సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా గ్రామం మొత్తం డప్పు వాయిద్యాలతో, కోలాట నృత్యాలతో వాహన దారులు ఊరేగింపుగా పూజా సామాగ్రిని ఆయుధపూజ నిర్వహించే చోటుకి తీసుకొనివచ్చారు. అనంతరం గ్రామంలో జూపార్క్ మాజీ డైరెక్టర్ మణియాదవ్ ఆధ్వర్యంలో 400మందికి అన్నదానం చేపట్టారు. నాయకులు వెంకటరత్నం, మణి యాదవ్, చెంగల్రాయులు, క్రిష్ణయ్య, రామచంద్రయ్య, సుబ్బయ్య, కసాగో పాల్, మునిరత్నం, దేవేంద్ర, శేషాద్రి, కృష్ణయ్య, మునేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ప్రెస్‌క్లబ్ ఎన్నికల పోలింగ్



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి ప్రెస్‌క్లబ్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి బొమ్మల మురళి తెలిపారు. 562ఓట్లకు గాను 517ఓట్లు పోల్ అయినట్లు చెప్పారు. పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్ ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్లో ఓటును వినియోగించుకున్నారు. సోమవారం ఓట్ల లెక్కింపు జరిపి, విజేతలను ప్రకటిస్తామన్నారు.

విద్యారంగ ఉద్యమంలో ఘనమైన చరిత్ర ఎఐఎస్ఎఫ్ ది

- డాక్టర్ కే నారాయణ



ప్రజాశక్తి-క్యాంపస్: అఖిల భారత విద్యార్థి సమైక్య ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ విద్యార్థి ఉద్యమ నాయకుల ఆత్మీయ సమావేశం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే శివారెడ్డి అధ్యక్షతన స్థానిక బైరాగి పట్టెడలోని గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్‌లో నిర్వహించారు. ఈ ఆత్మీయ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ మాజీ నేత, సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ విద్యా రంగంలో అఖిల భారత విద్యార్థి సమైక్య అజీరామమైన పోరాటాలు నిర్వహించిందని అనేక సమస్యల పరిష్కారానికి విరోచిత ఉద్యమాలు నిర్వహించింది అన్నారు. ఎక్కడున్నా మనందరం సమాజ ఉద్ధరణకు పనిచేయాలని సూచించారు. ఉద్యమ దశలో జరిగిన అరెస్టులు లాఠీ చార్జీలు, జైలు శిక్షలు తదితర గత స్మృతులను నెమరేసుకున్నారు. మనందరం నేడు ఒకే వేదికపై కలవడం ఎంతో ఆనందంగా ఉందని విచ్చేసిన ఆత్మీయులు తమ అనుభవాలను పంచుకున్నారు. నవంబర్ 27-30 విజయనగరంలో జరిగే ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభల పోస్టర్ విడుదల చేశారు. అనంతరం ఉద్యమ జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జాతీయ నాయకులు గుజ్జల ఈశ్వరయ్య, రామానాయుడు, బోసుగాని లక్ష్మయ్య, మాజీ జాయింట్ కలెక్టర్ ఎన్.ఈశ్వరయ్య, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ప్రొ కె రాజశేఖర్ ప్రొ కెవి రమణ, విశ్వనాథరెడ్డి, మోహన్ కుమార్, మంజునాథ్, సోంప్రకాష్, కోట పురుషోత్తం విజయభాస్కర్, రాజారెడ్డి, నాగరాణి, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ రంజిత్, డాక్టర్ ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో ఘనంగా ఫెర్టిజ్ఞాన్ సదస్సు



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: తిరుపతి అబ్‌స్టెట్రిక్స్ గైనకాలజికల్ సొసైటీ సహకారంతో ఫెర్టి9 ఆధ్వర్యంలో తిరుపతిలో ఫెర్టిజ్ఞాన్ పేరుతో వైద్య సదస్సును ఘనంగా నిర్వహించారు. ఫెర్టిలిటీ ట్రీట్‌మెంట్ రంగంలో, ముఖ్యంగా ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవిఎఫ్)లో ఆరోగ్య సంరక్షణ నిపుణుల పరిజ్ఞానం, నైపుణ్యాన్ని పెంపొందించడం ఈ కార్యక్రమం లక్ష్యంగా చేసుకుంది. సంతానోత్పత్తి సంరక్షణలో రోగి ఫలితాలను మెరుగుపరచడానికి తాజా సాంకేతికతలు, అందుబాటులోని ఉత్తమ పద్ధతులను ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ భారతదేశంలో, దాదాపు 28 మిలియన్ల జంటలు సంతానోత్పత్తి సమస్యలను ఎదుర్కొంటున్నారు. నిశ్చల జీవనశైలి, పెరుగుతున్న ఒత్తిడి స్థాయిలు, ఊబకాయం, ఇతర వైద్యపరమైన కారణాల వల్ల ఈ సంఖ్య పెరుగుతూనే ఉందన్నారు. ఈ వైద్య సదస్సులోని చక్కటి నిర్మాణాత్మక మాడ్యూల్స్, వైద్యులు ఈ డిమాండ్‌ను తీర్చడానికి అవసరమైన సాధనాలను అందించారు. పునరుత్పత్తి వైద్యంలో తాజా ఆవిష్కరణలను చర్చించడం ఎంతో అవసరం అన్నారు. సంతానోత్పత్తి చికిత్సలు అభివృద్ధి చెందుతూనే ఉన్నందున, ఈ పురోగతిలో ముందంజలో ఉండటం మనకు చాలా కీలకం అని వెల్లడించారు. ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ సునీత సాధు మాట్లాడుతూ, "వంధ్యత్వంతో పోరాడుతున్నప్పుడు కలిగే భావోద్వేగాల ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుంది, ఇది ఆ జంట జీవితంలోని సంబంధాల నుండి మానసిక ఆరోగ్యం వరకు ప్రతి అంశాన్ని ప్రభావితం చేస్తుంది. ఈ భావోద్వేగ భారాన్ని గుర్తించడం చాలా అవసరం. అయితే, సరైన మద్దతుతో, అంటే, కౌన్సెలింగ్ లేదా సమాజ మద్దతు ద్వారా, అధునాతన వైద్య చికిత్సలను కూడా అందిస్తే, ఆశకు మార్గం ఉందన్నారు. డాక్టర్ దీప్తి దామోదర మాట్లాడుతూ, "వంధ్యత్వం అనేది పురుషులు, మహిళలు ఇద్దరినీ ప్రభావితం చేసే సంక్లిష్టమైన సమస్య, తరచుగా ఒంటరితనం నిరాశ భావాలను సృష్టిస్తుంది. చికిత్సలో ఈ సమస్యలను అన్ని విధాలుగా పరిష్కరించడం ముఖ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 130 మందికి పైగా గైనకాలజిస్టు పాల్గొన్నారు.

సండే కూడా కార్మికులకు విశ్రాంతి లేదా!

ప్రజాశక్తి-తడ: మండలంలోని మాంబట్టు ఏపిఐఐసి సెజ్‌లో వున్న పలు కంపెనీలు ఆదివారం అయిన యధాతథంగా నడిచాయి. వాటిలో అపాచి, భారతీయ లాంటి పలు కంపెనీలు రోజు లాగే కొనసాగాయి. కార్మికులు తమ పనులను చేసుకోవడానికి కూడా వీలు లేదని వాపోయారు.

వినాయకునికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రూరల్ మండలం తొర్రూరు గ్రామంలో వినాయకునికి సంఘట హర చతుర్థి సందర్భంగా భక్తులందరూ పాలాభిషేకం ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. స్థానికులు రవికుమార్ ఏర్పాట్లును పర్యవేక్షించారు.

ఇది చెరువు కాదు రోడ్డే.!



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని ప్రధాన కూడలి నుండి కనమనంబేడు గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గం గుంతలమైయమైంది. దీంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డులోని గుంతలు చెరువును తలపిస్తున్నాయి. బుచ్చినాయుడు కండ్రిగ పంచాయతీ పరిధిలో ఉన్న అరుంధతి వాడ వద్ద పెద్ద గుంత ఏర్పడడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోవాలాలు, ఫోర్ వీలర్స్ వెళ్లాలంటే వాహనాలు నీటిలో మునిగి పోతుండటంతో సైలెన్సర్లలోకి నీరు వెళ్లి వాహనాలు మొరాయిస్తున్నాయి. అంతేకాకుండా పాదచారులు నీటిలో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.

విజయవాడకు బయలుదేరిన ఆశా వర్కర్లు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి యూనియన్ నాయకులు చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చందామర్రై, జిల్లా అధ్యక్షులు గీత ఆధ్వర్యంలో ఆదివారం ఆశా వర్కర్లు విజయవాడకు బయలుదేరి వెళ్లారు.


చెట్లను నాటండి పర్యావరణాన్ని పరిరక్షించండి

- రిజిస్ట్రార్ భూపతి నాయుడు

ప్రజాశక్తి-క్యాంపస్: చెట్లను నాటండి పర్యావరణాన్ని పరిక్షించండి అని ఎస్వీయూ రిజిస్ట్రార్ ఎమ్.భూపతి నాయుడు పిలుపునిచ్చారు. ఎస్వీయూలో ప్రతి మూడవ శనివారం జరిగే వర్సిటీ కార్యక్రమం "క్లీన్ అండ్ గ్రీన్" భాగంగా వర్సిటీలో వివిధ ప్రాంతాలలో ఎన్ఎస్ఎస్ బ్యూరో, ఇంజనీరింగ్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు చేత చెట్ల నాటే కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు ఎస్వీయూ వామనరావు భవనం ఎదుట, అన్నపూర్ణ క్యాంటీన్, ఎదుట వర్సిటీ ఏ బ్లాక్ ఎదురుగా ఉన్న మైదానంలో చెట్లను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ ప్రకృతి విపత్తులను తట్టుకొని నిలబడాలన్న, జీవజాతికి మేలు జరగాలన్న గణనీయంగా తగ్గిన చెట్లను అదే స్థాయిలో మనం పెంచాల్సిన సమయం ఆసన్నమైందనీ, దీనిని విద్యార్థులు, సమాజంలో ఉన్న పౌరులు బాధ్యతగా చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు వర్సిటీలో వివిధ ప్రాంతాలలో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు చెట్లు నాటే కార్యక్రమం చేయడం జరిగింది. కార్యక్రమంలో వర్సిటీ ప్రిన్సిపాల్స్, సిడిసిడీన్ ఆచార్య చంద్రాయుడు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణ, దామోదరం, కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, ఇంజనీర్ తాండవ కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్వీయూ అడ్మిషన్లలో విద్యార్థులందరికీ అవకాశం కల్పించాలి

- ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి మాధవకృష్ణ



ప్రజాశక్తి-క్యాంపస్: ఎస్వీయూలో 2024 విద్యా సంవత్సరానికి గాను పీజీ కోర్సుల్లో వివిధ కోర్సులలో చేరేందుకు అభ్యర్థులకు స్పాట్ అడ్మిషన్లలో సీట్ రాని విద్యార్థులకు, అనివార్య కారణాలవల్ల విద్యార్థులు పిజిసెట్ పరీక్ష రాయని వారికి కూడా అవకాశం కల్పించి స్పాట్ అడ్మిషన్లలో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి ఎం మాధవకృష్ణ డిమాండ్ చేశారు. గత మూడు సంవత్సరాలుగా రాష్ట్ర ఉన్నత విద్యా మండలి తీసుకున్న అనైతిక, అసాంఘిక నిర్ణయాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి అన్ని విశ్వవిద్యాలయాల్లో ఒకేసారి పీజీ సెట్ ఎంట్రెన్స్ నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులు, నిరుపేద విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ఆరోపించారు. గతంలో ఉన్నటువంటి ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య హేమ్చంద్రారెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన ఖర్చులు తగ్గించాలని ఉద్దేశంతో అడ్మిషన్ల సంఖ్యను పూర్తిగా తగ్గించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి ప్రవేశ పరీక్షను ఏర్పాటు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యా వ్యవస్థను గత ప్రభుత్వం పూర్తిగా భ్రష్టు పట్టించిందని, ప్రస్తుత ప్రభుత్వం అయినా ఉన్నత విద్య అభ్యసించేందుకు నిరుపేద విద్యార్థులకు అవకాశం కల్పించాలని సూచించారు.

ఘనంగా ద్రావిడ విశ్వవిద్యాలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి - కుప్పం టౌన్, గుడిపల్లి : ద్రావిడ విశ్వవిద్యాలయ 27వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడా ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మరమ్మత్, విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్, ఆచార్య ఎం దొరస్వామి, రిజిస్ట్రార్ వి కిరణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆ తర్వాత వర్సిటీ కందుకూరి వీరేశలింగం పంతులు ఆడిటోరియంలో జరిగిన సభలో ముఖ్య అతిథి కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ..యూనివర్సిటీ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. యూనివర్సిటీ అభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. వర్సిటీని ప్రక్షాళన చేసేందుకు టిడిపి ప్రభుత్వం నడుం బిగించిందని, దేశంలో ద్రావిడ విశ్వవిద్యాలయానికి ప్రత్యేక స్థానం వుందని.. యూనివర్సిటీని అభివృద్ధి చేసేందుకు ప్రతి ఉద్యోగి కష్ట పడి పని చేయాలన్నారు. వర్సిటీలో కింది స్థాయి నుంచి పై స్థాయి దాకా అందరూ కలిసికట్టుగా ఒకే తాటిపై వర్సిటీ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఎన్టీఆర్ ఎంతో ఉన్నతాశంతో ఏర్పాటు చేసిన యూనివర్సిటీని అభివృద్ధి చేసి ఆయన ఏర్పాటు చేసిన ఉద్దేశానికి న్యాయం చేయాలన్నారు. మరో ముఖ్య అతిథి పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయం కుప్పంలో స్థాపించడానికి చేసిన కృషి గురించి వివరించారు. కడ పీడీ వికాస్ మరమ్మత్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఎలా చదువుకోవాలి? సమాజం పట్ల ఎలా నిబద్ధతతో ఉండాలో విశ్వవిద్యాలయం నుంచి నేర్చుకోవాలని చెప్పారు. విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి గురించి వివరిస్తూ విశ్వవిద్యాలయ ముందు ఐదేళ్ళ ఎలా అభివృద్ధి చేయాలో ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులు, ఉద్యోగస్తులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



ద్రావిడ విశ్వవిద్యాలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ శ్రీకాంత్, అతిథులు

నూతన భవనాలు ప్రారంభం

ఈ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన క్లాస్ రూమ్స్‌ను కంచర్ల శ్రీకాంత్, పిఎస్ మునిరత్నం, విశ్వ విద్యాలయ ఉపకులపతి ఆచార్య దొరస్వామి ప్రారంభించారు.

'బలిజ భవన నిర్మాణానికి కృషి చేస్తాం'



ఐక్యత చాటుతున్న సమితి నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని నరసింహ తీర్థం మార్గంలో మాజీ ఎమ్మెల్యే మన్నూరు వెంకటరమణ చొరవతో ప్రభుత్వం కేటాయించిన స్థలంలో బలిజ భవన నిర్మాణానికి కృషి చేస్తున్నామన్నారు. త్వరలో తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే మన్నూరు సుగుణమ్మ ఆధ్వర్యంలో నిర్మాణ పనులు ప్రారంభిస్తామని ఆంధ్ర రాష్ట్ర బలిజ హక్కు సంరక్షణ సమితి సభ్యులు యండమూరి నాగేంద్రబాబు, న్యాయవాది శరణ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆంధ్రరాష్ట్ర బలిజ హక్కు సంరక్షణ సమితి కార్యాలయంలో బలిజ సమైక్య మొదటి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బలిజల అభ్యున్నతకై సమైక్యతతో పోరాడుతామన్నారు. సమితి కార్యక్రమాలను ప్రణాళిక బద్ధంగా నిర్వహించి బలిజల హక్కుల సంరక్షణకు పాటుపడతామన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రమౌళి హరిరాయల్, ఉమాపతి ఎన్‌హెచ్ తేజ రాయల్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వల భవిత ఉంటుందని డీవైఈవో ప్రభాకర్ రాజు పేర్కొన్నారు. పుత్తూరులోని బీఎస్ క్రికెట్ అకాడెమీలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-17 బాలబాలికల క్రికెట్ జిల్లా జట్ల ఎంపికలు నిర్వహించారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు నవంబర్‌లో గుంటూరులో జరిగే అండర్- 17 క్రికెట్ పోటీల్లో పాల్గొంటారన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ యుగంధర్, టీడీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగరెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి శరత్, టీడీపీ పట్టణ అధ్యక్షులు జీవరత్నం, బీఎస్ స్పోర్ట్స్ క్లబ్ ఆర్గనైజర్ శ్రీనివాసులు, బీఆర్ మురళి, బీఆర్ హేమాద్రి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బాబు పాల్గొన్నారు.

ఎస్వీయూలో పీజీ కోర్సుల సీట్లను భర్తీ చేయాలి

- శివశంకర్ నాయక్



ప్రజాశక్తి-క్యాంపస్: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీ సెట్ 2024 విద్యా సంవత్సరంలో మిగిలిపోయిన, ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయాలని నవ సమాజ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు శివశంకర్ నాయక్ డిమాండ్ చేశారు. ఎస్వీయు రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడుకి వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఏపీ పీజీ సెట్ 2024 పరీక్షలు అనివార్య కారణాలవల్ల దరఖాస్తు చేయని, పరీక్ష రాయని విద్యార్థులకు కూడా పీజీలో చేరేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో వర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాలరాసిన రాష్ట్ర ఉన్నత విద్యా మండలి సెంట్రలైజ్డ్ అడ్మిషన్లు నిర్వహించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాల్లో పీజీ అడ్మిషన్ల భర్తీ కాలేదని, ఆయా విభాగాల్లో పీజీ కోర్సుల సీట్లు 40శాతం కూడా మించలేదని ఆక్రోసించారు. గతంలో నిర్వహించిన అడ్మిషన్ల ప్రక్రియ మాదిరిగానే ఈ సంవత్సరం కూడా కొనసాగుతుందని ఈ నిబంధనను ఎత్తివేసి ఏపీ పీజీ సెట్ వ్రాసిన విద్యార్థులకు, డిగ్రీ పాసైన విద్యార్థులకు పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజనవ సమాజ్ విద్యార్థి విభాగం నాయకులు ప్రశాంత్, సునీల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కనపడకుండా పోయిన బాలిక కథ సుఖాంతం

24 గంటలలోనే బాలికను సురక్షితంగా కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: కనపడకుండా పోయిన బాలికను పోలీసులు ఎట్టకేలకు పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించడంతో కథ సుఖాంతం అయింది. తిరుపతి ఈస్ట్ పోలీసుల కథనం మేరకు తిరుపతి కొర్లగుంట మారుతి నగర్ నివాసం ఉంటున్న ఒక బాలిక తప్పిపోయిందని పోలీస్ కమాండ్ కంట్రోల్‌కి తల్లిదండ్రులు సమాచారం ఇచ్చారు. కంట్రోల్ రూమ్ ద్వారా సమాచారం అందుకున్న ఈస్ట్ పోలీసులు వెంటనే స్పందించి బాలిక తల్లిదండ్రుల ద్వారా వారు ఇచ్చిన సమాచారంతో ఎస్పీ సుబ్బరాయుడు సూచనలతో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి గుత్తి, గుంతకల్ మధ్యలో రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. బాలికను అక్కడి స్థానిక పోలీసులు, స్నేహితుల సహాయంతో ఈస్ట్ సీఐ సూచనలు మేరకు గుర్తించి, చేరదీసి, తిరుపతి పోలీసులకి సమాచారం అందించారు. వెంటనే దగ్గరలో ఉన్న ప్రత్యేక పోలీస్ బృందాలు అమ్మాయిని తీసుకువచ్చి సురక్షితంగా వారి తల్లిదండ్రులకు అప్ప గించారు. సమాచారం ఇచ్చిన వెంటనే స్పందించి 24గంటల్లో బాలికను అప్పగించినందుకు వారి తల్లిదండ్రులు తిరుపతి పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రకాశం కాలనీలో పోలీసుల కార్డెన్ సెర్చ్

- సరైన పత్రాలు లేని వాహనాలు సీజ్

ప్రజాశక్తి-కోట: మండలంలోని గూడలి పంచాయతీ ప్రకాశం కాలనీలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం 5 గంటలు నుంచి స్థానిక సీఐ, ఎస్ఐల ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. దీనిలో భాగంగా ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎవరైనా అనుమానితులు, కొత్త వ్యక్తులు ఉన్నారనే ఉద్దేశంతో ప్రతి ఇంటిలో ఉన్న వ్యక్తుల ఆధార్ కార్డులను పరిశీలించారు. ఈ తనిఖీలలో భాగంగా సరైన పత్రాలు చూపించని 7 వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. అనంతరం కోట ఎస్ఐ పవన్ కుమార్ మాట్లాడుతూ మండలంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకే ఈ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అంతే కాకుండా ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే భయపడకుండా సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోట ఎస్ఐ పవన్ కుమార్, వాకాడు ఎస్ఐ నాగబాబు, చిట్టమూరు ఎస్ఐ చిన్న బలరామయ్య, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల పోలీసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


14 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



స్మగ్లర్లు, కారు, దుంగలు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

ప్రజాశక్తి- చిన్నగొట్టిగల్లు: శేషాచలం అటవీ పరిధిలోని భాకరపేట సమీపంలో 14ఎర్రచందనం దుంగలు, ఒక కారు, మరో మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకుని, ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఆర్ఎస్ఐలు విశ్వనాథ్, లింగాధర్ బృందాలు భాకరాపేట వైపు కూంబింగ్ చేస్తుండగా చిన్నగొట్టిగల్లు మార్గంలోని కోటబైలు వద్ద కారులో ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తూ కనిపించారని తెలిపారు. వారిని చుట్టుముట్టి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. పారిపోయిన వారికోసం గాలింపు చర్యలు చేపట్టా మన్నారు. పట్టుబడిన ముగ్గురు స్మగ్లర్లు చిత్తూరు ప్రాంతానికి చెందినవారుగా గుర్తించామన్నారు. అరెస్టు చేసిన వారిని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించగా సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ తిమ్మయ్య హెచ్చరించారు. తొట్టంబేడు పంచాయతీలోని బీడీ కాలనీలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తనిఖీలు నిర్వహించారు. గంజాయి వంటి నిషేధిత మత్తు పదార్థాలు వినియోగించినా, రవాణా చేసినా, విక్రయించినా తీవ్ర నేరంగా పరిగణించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదే కోణంలో ఈ ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచామని స్పష్టం చేశారు. అనంతరం దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. సరైన ధృవపత్రాలు లేని ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్ కు తరలించారు. ఎస్ఐ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.